సాక్షి
తిరుపతి
సోమవారం । 6 । జనవరి । 2025



మీరెలా ఆక్రమించుకుంటారు?

ఎవరి నియోజకవర్గంలో వారే ప్రభుత్వ స్థలాల ను ఆక్రమించుకోవాలన్న టీడీపీ నేత ల తీరు హాట్‌టాపిక్‌గా మారింది. - 8లో



రంకెలేసిన కోడెగిత్తలు

కొత్త ఏడాది ప్రారంభం కావడంతో చంద్రగిరి, రామచంద్రాపురం మండలాల్లో ఎడ్లపందేలు జోరుగా సాగాయి. - 8లో



మొదటి ఘాట్‌రోడ్డులో ప్రమాదం

తిరుమల నుంచి కిందకు దిగుతుండగా వాహనం బోల్తా పడి నలుగురు గాయపడిన ఘటన వెలుగు చూసింది. - 8లో

న్యూస్‌రీల్

గుడిమల్లం ఆలయ పరిశీలన



పరశురామేశ్వరాలయాన్ని పరిశీలిస్తున్న పురావస్తుశాఖ అధికారులు

రేణిగుంట(ఏర్పేడు): ఏర్పేడు మండలంలోని గుడిమల్లం పరశురామేశ్వరాలయాన్ని ఆదివారం పురావస్తు శాఖ అధికారులు పరిశీలించారు. దక్షిణ భారతదేశంలోనే అతిపురాతన శైవక్షేత్రమైన ఈ ఆలయంలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించి ప్రతిపాదనలను సిద్ధం చేయనున్నట్లు పురావస్తుశాఖ సౌత్‌జోన్ రీజనల్ డైరెక్టర్ ఎన్‌కే పతాక్ తెలిపారు. ఆలయ ప్రతిష్ట, ప్రాశస్త్యం భక్తులకు మరింత చేరువయ్యే దిశగా అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టేందుకు అడుగులు వేస్తున్నట్లు వివరించారు. ఆలయ మాజీ చైర్మన్ బత్తల గిరినాయుడు, ఈఓ రామచంద్రారెడ్డి వారికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేసి శాలువాలతో సత్కరించారు. సూపరింటెండెంట్ గోపీనాథ్, సీఐ బాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో గ్రీవెన్స్

తిరుపతి అర్బన్: కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ చేపట్టనున్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు గ్రీవెన్స్ కొనసాగుతుంది. ఈ సందర్భంగా జిల్లాకు చెందిన అన్ని విభాగాల అధికారులు హాజరు కానున్నారు. ఈ క్రమంలో జిల్లావాసులు వారి సమస్యలను తెలియజేయడానికి చక్కటి అవకాశంగా భావించి సద్వినియోగం చేసుకోగలరని అధికారులు తెలిపారు.


నేటి నుంచి క్రీడా సాంస్కృతిక పోటీలు

తిరుపతి సిటీ: ఎస్వీ వెటర్నరీ కళాశాల వేదికగా సోమవారం నుంచి ఈ నెల 10వతేదీ వరకు వెటర్నరీ వర్సిటీ అంతర్ కళాశాలల క్రీడా, సాంస్కృతిక పోటీలను నిర్వహిస్తున్నట్లు అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ జగపతిరామయ్య ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా నాలుగు వెటర్నరీ, ఒక డెయిరీ కళాశాల నుంచి సుమారు 490మంది విద్యార్థులు వివిధ విభాగాలలో తమ ప్రతిభను ప్రదర్శించనున్నారని తెలియజేశారు. ఐదురోజుల పాటు జరిగే ఈ పోటీలకు విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ప్రారంభ కార్యక్రమానికి టీటీడీ విజిలెన్స్ అధికారితో పాటు వీసీ పాల్గొంటారని తెలిపారు.

తొలగింపులకు కుట్ర

పింఛన్ల కుదింపునకు కూటమి సర్కారు సిద్ధమైంది. పింఛన్లు తీసుకునే లబ్ధిదారులకు వికలాంగత్వాన్ని నిర్ధారిస్తూ గతంలో ప్రభుత్వ వైద్యులు జారీ చేసిన సదరం సర్టిఫికెట్లలో నకిలీలు ఉన్నాయనే ఉద్దేశంతో పింఛన్ల తనిఖీలు చేస్తున్నామంటూ అధికారులు చెబుతున్నారు. అయితే కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటి వరకు కారణం లేకుండా 7,188 మంది పింఛన్లను తగ్గించింది. మరి ఇప్పుడు చేపట్టిన తనిఖీల్లో ఇంకెన్ని పింఛన్లకు కోత వేస్తారోనని పలువురిలో ఆందోళన మొదలైంది.





ఈ ఏడాది జనవరిలో పింఛన్ పొందినవారు..

పింఛన్ రకం	ప్రతి నెలా ఇస్తున్న నగదు	సంఖ్య
అభయహస్తం	రూ.5000	6522
అమరావతి ల్యాండ్ పూర్	రూ.5 వేలు	01
ద్వైపాక్షిక ఎలిఫెంటియాసిస్ గ్రేడ్-4	రూ.10 వేలు	110
సీకేడీ అంచనా వేసిన జీఎఫ్ఆర్	రూ.10 వేలు	13
సీకేడీ సీరం క్రియాటినిన్	రూ.10 వేలు	05
సీకేడీ చిన్న కాంట్రాక్ట్ కిడ్నీ	రూ.10 వేలు	11
సీకేడీ ప్రభుత్వం	రూ.10 వేలు	174
సీకేడీ ప్రైవేటు	రూ.10వేలు	877
డప్పు కళాకారులు	రూ.4 వేలు	4,066
వికలాంగులు	రూ.6 వేలు	31,153
మత్స్యకారులు	రూ.4 వేలు	1802
కిడ్నీ, కాలేయం, గుండె మార్పిడి	రూ.10 వేలు	42
మల్టీడిఫార్మిటీ లెప్రసీ	రూ.6వేలు	500
వృద్ధులు	రూ.4 వేలు	1,32,889
పక్షవాతంతో మంచానికే పరిమితం	రూ.15 వేలు	643
కళాకారులు	రూ.4 వేలు	109
సైనిక సంక్షేమ	రూ.5 వేలు	15
తీవ్రమైన హిమోఫీలియా	రూ.10 వేలు	38
త్రీవమైన మస్క్యులర్ డిస్ట్రోఫీ	రూ.15 వేలు	557
సికిల్ సెల్ వ్యాధి	రూ.10 వేలు	17
ఒంటరి మహిళ	రూ.4 వేలు	6318
తలసేమియా	రూ.10 వేలు	34
కల్లుగీత కార్మికులు	రూ.4వేలు	1359
చెప్పులు కుట్టేవారు	రూ.4 వేలు	880
ట్రాన్స్‌జెండర్	రూ.4 వేలు	65
నేత కార్మికులు	రూ.4వేలు	5454
వితంతువులు	రూ.4వేలు	70341

- నేటి నుంచి జిల్లాలో పింఛన్ల తనిఖీ
- సిద్ధమైన అధికార యంత్రాంగం
- తొలి విడతలో రూ.15 వేలు తీసుకునే 1,199 పింఛన్ల పరిశీలన
- గతంలో జారీ చేసిన సదరం సర్టిఫికెట్లలో నకిలీలు ఉన్నాయంటున్న అధికారులు
- ఇప్పటికే ఏ కారణం లేకుండా తొలగించిన పింఛన్లు 7188
- ఇప్పుడు తనిఖీల పేరిట కోత పడేదెన్నో..!
- ఒక్కో బృందంలో ముగ్గురు వైద్యులు, ఒక డిజిటల్ అసిస్టెంట్
- ఈ బృందాలకు ఒకరు లేదా ఇద్దరు కానిస్టేబుళ్లతో భద్రత

మాకు భద్రత కల్పించండి..

మేము ముందే పక్క జిల్లాల నుంచి వస్తున్నాం.. వారి పింఛన్లకు భంగం కలుగుతుందని తమపై ద్వేషం పెంచుకునే ప్రమాదం ఉన్న నేపథ్యంలో సెక్యూరిటీని ఏర్పాటు చేయాలని తనిఖీకి నియమించిన డాక్టర్లు జిల్లా కలెక్టర్‌ను కోరారు. దీంతో ఒక్కో బృందానికి ఒకరు లేదా ఇద్దరు పోలీసులను ఏర్పాటు చేస్తున్నారు. తనిఖీల బృందాలతోనే పోలీసులు ఉంటారు.

తిరుపతి అర్బన్: జిల్లావ్యాప్తంగా సామాజిక భద్రతా పింఛన్ల తనిఖీకి అధికార యంత్రాంగం సర్వం సిద్ధమైంది. సోమవారం నుంచి ఈ నెల 31వ తేదీ జరిగే తనిఖీలకు నెల్లూరు జిల్లా నుంచి 10 డాక్టర్లను, అన్నమయ్య జిల్లా నుంచి నలుగురు డాక్టర్లను నియమించారు. వీరు రూ.15 వేలు పింఛన్ తీసుకుంటున్న 1199 మందిని వారి ఇళ్ల వద్దకే వెళ్లి తనిఖీ చేయనున్నారు.

జిల్లాలో ఏడు బృందాలు..

జిల్లాలో ఏడు బృందాలు నేటి నుంచి తనిఖీలు చేయనున్నారు. ఒక్కో బృందంలో పక్కా జిల్లాలకు చెందిన ఇద్దరు వైద్యులు, తిరుపతి జిల్లాకు చెందిన ఓ పీహెచ్‌సీ వైద్యుడు, సచివాలయంలోని డిజిటల్ అసిస్టెంట్ ఉంటారు. అంటే ఒక తనిఖీ బృందంలో నలుగురు ఉంటారు. అదనంగా సెక్యూరిటీ ఉంటారు. వారంలో మూడు రోజులు మాత్రమే తనిఖీలు చేస్తారు. మిగిలిన మూడు రోజులు వారి రోజువారీ డ్యూటీలకు వెళ్తారు.

పింఛన్‌దారుల్లో టెన్షన్.. టెన్షన్

ముందు రోగంతో మంచాన పడ్డారు. ఈ క్రమంలో తనిఖీల పేరుతో పింఛన్ తీసుకుంటున్న రోగుల వారి సర్టిఫికెట్లను వైద్యులు తనిఖీ చేయనున్నారు. రూ.15 వేలు పింఛన్లు పక్షవాతం, కండరాల సమస్యతో మంచానికే పరిమితమైనవారిని నేరుగా కలిసి పరిశీలిస్తారు. వచ్చే నెల ఫిబ్రవరిలో విభిన్న ప్రతిభావంతులు, దీర్ఘకాలిక రోగులు, కళాకారులు, మార్చిలో వితంతువులను, ఏప్రిల్‌లో వృద్ధుల పింఛన్లను పరిశీలన చేయనున్నారు. అయితే తమ అర్హతను పరిశీలిస్తే ఇబ్బంది లేదని, పార్టీలను అంటగట్టి రాజకీయ రంగు పూస్తేనే ఇబ్బంది వస్తుందని పింఛన్‌దారులు చెబుతున్నారు.

జిల్లాలో 2,63,995 పింఛన్లు ..

జిల్లాలో 27 రకాలకు చెందిన పింఛన్లు ప్రతి నెలా 2,63,995 మంది పొందుతున్నారు. అయితే తనిఖీలు పూర్తయిన తర్వాత ఎంతమందిని తొలగిస్తారనే ఆందోళన అందరిలో నెలకొంది. ఇటీవల జిల్లాకు ఒక గ్రామంలో తనిఖీలు అంటూ పైలట్ ప్రాజెక్టులో భాగంగా రేణిగుంట మండలం సూరప్పకశంలో చేపట్టిన తనిఖీల్లో 17 మందిని అనర్హులుగా గుర్తించారు. ఈ లెక్క ప్రకారం ఎంతమందికి పింఛన్ గండి పడుతుందోనని అంతా ఆందోళన చెందుతున్నారు.

శ్రీవారి దర్శనానికి 6 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. శనివారం అర్ధరాత్రి వరకు 71,990 మంది స్వామివారిని దర్శించుకోగా 21,205 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 3.26 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలో, దర్శన టికెట్లు లేని భక్తులకు 6 గంటల్లో, ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలలో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయాన్ని కంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలో అనుమతించరని స్పష్టం చేసింది.

నేటి నుంచి ఆండాల్ అమ్మవారి నీరాటోత్సవాలు



రామచంద్ర కట్టపైకి ఊరేగింపుగా వేంచేస్తున్న గోవిందరాజస్వామి

తిరుపతి కల్చరల్: శ్రీగోవిందరాజస్వామి ఆలయంలో ఈనెల 6వ తేదీ నుంచి ఈనెల 12వ తేదీ వరకు శ్రీఆండాళ్ అమ్మవారి నీరాటోత్సవాలు వేడుకగా జరుగనున్నాయి. ఉత్సవాల నేపథ్యంలో ఆదివారం శ్రీగోవిందరాజస్వామి వారు పల్లకీలో ఊరేగింపుగా శ్రీరామచంద్రపుష్కరిణి కట్టపైకి వేంచేపు చేశారు. ఆండాళ్ అమ్మవారి నీరాటోత్సవాల ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు స్వామివారు ముందుగా ఊరేగింపుగా వెళ్లడం ఆనవాయితీ. ఇందులో భాగంగా సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహించారు. సోమవారం నుంచి ఆరంభం కానున్న నీరాటోత్సవాలలో భాగంగా ప్రతి రోజూ ఉదయం 5.30 గంటలకు శ్రీఆండాళ్ అమ్మవారు ఊరేగింపుగా బయలుదేరి గోవిందరాజస్వామి ఆలయ మాడ వీధులు, చిన్నబజారు వీధి, శ్రీకోదండరామాలయం మాడ వీధుల మీదుగా రామచంద్ర కట్టపైనున్న నీరాట మండపానికి చేరుకుంటారు. అక్కడ అమ్మవారికి అభిషేకం, ఆస్థానం నిర్వహిస్తారు. ఆండాళ్ అమ్మవారు స్వామి వారి కోసం చేసిన తపస్సుకు ప్రతీకగా ఈ ఉత్సవం నిర్వహిస్తారు. ఏడు రోజుల పాటు ఈ ఉత్సవం నిర్వహించనున్నట్టు టీటీడీ అధికార వర్గాలు తెలిపాయి. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ చిరంజీవి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ రాధాకృష్ణ, అర్చకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కార్యకర్తలే వైఎస్సార్‌సీపీకి బలం



సత్యవేడు ఆత్మీయ సమావేశంలో కార్యకర్తలకు భరోసా ఇస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు భూమన, ఎంపీ గురుమూర్తి, నియోజకవర్గ సమన్వయకర్త రాజేష్

- దారి దోపిడీదారులుగా కూటమి ప్రభుత్వ ఎమ్మెల్యేలు
- వైఎస్ జగన్ రాజకీయ నాయకుడిగా, పరిపాలనాదక్షుడిగా చరిత్ర సృష్టించారు
- సత్యవేడు ఆత్మీయ సమావేశంలో కూటమి ప్రభుత్వంపై నిప్పులు చెరిగిన భూమన కరుణాకర రెడ్డి

సత్యవేడు/వరదయ్యపాళెం: అధికారంలోకి వచ్చిన ఆరు నెలలకే కూటమి ప్రభుత్వానికి చెందిన 164 మంది ఎమ్మెల్యేలు దారి దోపిడీదారులుగా వ్యవహరిస్తూ అవినీతి అక్రమాలే ధ్యేయంగా వార్తల్లోకి ఎక్కుతున్నారని తిరుపతి, చిత్తూరు జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన సత్యవేడులో జరిగిన నియోజకవర్గ స్థాయి ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తల సమూహమే బలం అని.. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ప్రతిఒక్కరూ అండగా నిలిచి ఆయన నాయకత్వాన్ని బలపరచాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ముందుగా ఆయన, తిరుపతి ఎంపీ గురుమూర్తి, సమన్వయకర్త నూకతోటి రాజేష్, పార్టీ నాయకులతో కలసి దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన ప్రసంగిస్తూ అధికారం లేకున్నా.. ప్రతిపక్షంలో ఉన్నా.. కూటమి నాయకులు దాడులు చేసి తప్పుడు కేసులు బనాయించినా, మనోధైర్యంతో ఉత్సాహంతో ఈ సమావేశానికి వచ్చిన కార్యకర్తలకు తాను ఎల్లవేళలా అండగా ఉంటానన్నారు. ప్రపంచ దేశాలతో మన తెలుగు పిల్లలు పోటీ పడాలంటే ప్రభుత్వ పాఠశాలల్లో మాతృభాష తెలుగుతో పాటు ఇంగ్లీష్ తప్పనిసరి చేస్తే ఆ నిర్ణయాన్ని కూడా చంద్రబాబుకు వంతపాడే కుహనా మేధావులు అడ్డుకున్నారని ఆరోపించారు. 6 నెలలకే 3 పార్టీలు కలిసి ఉన్న కూటమి ప్రభుత్వం ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకతను మూటగట్టుకుందన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా వైఎస్సార్‌సీపీని అధికారంలోకి తెచ్చుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

అవినీతిపై వాళ్ల పత్రికలే రాస్తున్నాయి..

ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలోని తిరుపతి ఇన్‌చార్జ్ మంత్రి లీలల గురించి.. హోం మంత్రి పీఏపై ఆరోపణల గురించి వాళ్ల అనుకూల పేపర్లే రాశాయి. 164 మంది ఎమ్మెల్యేలు దారిదోపిడీ దొంగల కంటే దారుణంగా తయారయ్యారని.. వాళ్లను కంట్రోల్ చేయమని రాస్తున్నాయన్నారు.



జగన్‌మోహన్‌రెడ్డి ఫ్లకార్డుతో మహిళా అభిమాని

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 3.5 కోట్ల మంది ప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా సాయం చేస్తే.. గత ఎన్నికలప్పుడు తాము అంతకన్నా ఎక్కువగా చేస్తామని అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రజలకు మోసం చేస్తున్నారన్నారు.

గత ఐదేళ్లూ సంతోషంగా ఉన్నారు : ఎంపీ

జనన్న పాలనలో రాష్ట్రంలోని పేదలు ఐదేళ్ల సంతోషంగా ఉన్నారని తిరుపతి ఎంపీ గురుమూర్తి అన్నారు. జగన్‌మోహన్ రెడ్డి పాలనలో విద్య, ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇచ్చారని, పిల్లల అభివృద్ధి కోసం ఆంగ్లమాధ్యమం తీసుకొచ్చారన్నారు. కేవలం దోచుకోవడానికే చాలామంది చంద్రబాబు వైపు ఉన్నారన్నారు. రూ.1.20 వేల కోట్లు అప్పు చేసి, విద్యుత్‌చార్జీలు పెంచి, పన్నులు వేస్తూ పేదల కష్టాన్ని దోచుకుంటున్నారని, వీరికి ప్రజలే ప్రజాకోర్టులో శిక్ష వేస్తారన్నారు. 17–19 ఏళ్ల వయసులోనే కరుణాకరరెడ్డి దాదాపు 10వేల మందితో అధిక ధరలపై పోరాటం చేశారని గుర్తు చేశారు. మనమంతా ఆయన అడుగులో అడుగు వేసి మళ్లీ జగన్‌మోహన్ రెడ్డిని సీఎంగా, సత్యవేడులో రాజేష్‌ను గెలిపించుకుందాం అన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా..

సత్యవేడులో ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని నూకతోటి రాజేష్ అన్నారు. జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర రెడ్డి, మాట ఇస్తే తప్పేవారు కాదని, తాను ఈ స్థాయిలో ఉన్నానంటే తన తల్లి, పెద్దిరెడ్డి, మిథున్ రెడ్డి రాజకీయంగా పైకి తెచ్చారన్నారు. సత్యవేడులో మూడుసార్లు పార్టీ గెలిచింది. భూమన కరుణాకర రెడ్డి కార్యకర్తలకు అండగా ఉండే వ్యక్తి ఆయన అడుగుజాడల్లో నడుద్దామన్నారు. ఎంపీ గురుమూర్తి కార్యకర్తల కోసం పోరాడే వ్యక్తి అని తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కే.సుశీల్ కుమార్ రెడ్డి, నాయకులు అపరంజి రాజు, దయాకర్ రెడ్డి, గవర్ల కృష్ణయ్య, చలపతి రాజు, సారకాయలు, బీరేంద్రవర్మ, మాధవీలత, రాకేష్, చంద్రశేఖర్ రెడ్డి, కేవీ నిరంజన్ రెడ్డి, రమేష్, మస్తానీ, చిన్నదొరై, శ్యాం, మహేష్, దామోదర్ రెడ్డి, బొప్పన తిలక్, సురేష్, వినోద్, దివాకర్ రెడ్డి, అన్నాదొరై, ఉజ్వల్ రెడ్డి, కిరణ్ సాయి, నందగోపాల్, లాల్ బాబుయాదవ్, ధనుంజయరెడ్డి, హరిశ్చంద్ర రెడ్డి, రోస్ రెడ్డి, భాస్కర్ నాయుడు, తొప్పయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.



జగన్ ఫ్లకార్డులతో అభిమానుల సంతోషం



సమావేశానికి భారీగా హాజరైన వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు

నూతన కమిటీ ఎంపిక



ప్రమాణ స్వీకారం చేస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకుల సంఘం నూతన కమిటీ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకుల సంఘం జిల్లా నూతన కమిటీని ఎంపిక చేశారు. ఈమేరకు ఆదివారం యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో ఆదివారం నెల్లూరు జిల్లా ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు ఏ.నరసింహులు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. సంఘం జిల్లా అధ్యక్షుడిగా టి.నరసింహులు, కార్యదర్శిగా ఎస్.శ్రీకాంత్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా డాక్టర్ కే.కోటేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా డాక్టర్ కె.నరసింహ, కోశాధికారిగా డాక్టర్ మన్యం నరసింహులు నియమితులయ్యారు. నూతన కమిటీని రాష్ట్ర సంఘం సలహాదారుడు తమటం రామచంద్రారెడ్డి, ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.రవి, ఇతర అధ్యాపకులు అభినందించారు.

ఆట్టహాసంగా ఎన్‌ఎస్‌ఎఫ్ చాంపియన్ షిప్



పరుగు పందెం పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు

- పోటీల్లో పాల్గొన్న 600 మందికి పైగా ఆంధ్ర, తెలంగాణ క్రీడాకారులు



విజేతలకు సర్టిఫికెట్లను ప్రదానం చేస్తున్న ఎంఈఓ

నాయుడుపేటటౌన్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో నాయుడుపేట స్పోర్ట్స్ ఫౌండేషన్ (ఎన్‌ఎస్‌ఎఫ్)వారి సారథ్యంలో ఆదివారం సాయంత్రం వరకు 7వ అథ్లెటిక్ చాంపియన్‌షిప్ పోటీలు అట్టహాసంగా జరగాయి. పోటీల్లో ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాలకు చెందిన సుమారు 600 మందికి పైగా క్రీడాకారులు పాల్గొన్నారు. ఎన్‌ఎస్‌ఎఫ్ వ్యవస్థాపకులు, జాతీయ పారా అథ్లెటిక్ మోమిడి లక్ష్మయ్య, కమిటీ సభ్యుల సారథ్యంలో 6, 8, 10, 12, 14 ఏళ్ల పిల్లలకు 60, 80, 100, 200, 400, 600 మీటర్ల పరుగు పందెం పోటీలు నిర్వహించారు. ముందుగా ఈ పోటీలను జుడో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగూరయ్య, బట్టా సుబ్రహ్మణ్యం యాదవ్, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ, నాయకులు నెలవల రాజేష్, ఉయ్యాల ప్రవీణ్ కుమార్ తదితరులు జెండా ఊపి ప్రారంభించారు. ఐదు వరుస విజేతలుగా నిలిచిన వారికి నగదు బహుమతులతో పాటు మెడల్స్, సర్టిఫికెట్లు, స్పోర్ట్ టీషర్టులను అందించారు. కార్యక్రమంలో ఎంఈఓ మునిరత్నం, ఆర్యవైశ్య సంఘ తిరుపతి జిల్లా రూరల్ అధ్యక్షుడు గూడూరు కిషోర్ కుమార్, ఎన్‌ఎస్‌ఎఫ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆప్కోలో ఆన్‌లైన్ సేల్స్

తిరుపతి కల్చరల్: ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆప్కోలో ఆన్‌లైన్ సేల్స్ అధికారిక వెబ్‌సైట్ ×డబ్ల్యూడబ్ల్యూ డబ్ల్యూ.ఆప్కో హ్యాండ్లూమ్స్ డాట్ కామ్¤ ను ప్రారంభించినట్లు ఆప్కో మండల వాణిజ్యాధికారి ఎస్.కోటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆప్కోలో వివిధ రకాల పేరెన్నికైన మంగళగిరి, బందరు, రాజమండ్రి, ఉప్పాడ, వెంకటగిరి, మాధవరం, చీరాల కాటన్, పట్టు చీరలు, డ్రెస్ మెటీరియల్స్, రెడీమేడ్ షర్టులు, దుప్పట్లు, ధోవతీలు, లుంగీలు, టవల్స్ తదితర చేనేత వస్త్రాలు ఆప్కో అధికారిక వెబ్‌సైట్ ఆన్‌లైన్‌లో లభిస్తాయని పేర్కొన్నారు. తిరుపతిలోని గాంధీరోడ్డు, శ్రీనివాసం టీటీడీ కాంప్లెక్స్‌లోని ఆప్కో షోరూంలు, తిరుమల సప్తగిరి సర్కిల్ ఆప్కో షోరూంలలో అన్ని రకాల వస్త్రాలపై 30 శాతం డిస్కౌంట్ అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే తిరుపతి, నెల్లూరు, చిత్తూరు ఆప్కో షోరూంలలో అత్యాధునిక డిజైన్ల వస్త్రాలు ప్రజలకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు

– అడ్డుకున్న రెవెన్యూ అధికారులు



అక్రమ నిర్మాణాలను అడ్డుకున్న రెవెన్యూ అధికారులు

తిరుపతి మంగళం: తిరుపతి అర్బన్ మండలం మంగళం సమీపంలో ప్రభుత్వ భూమిలో ఆదివారం తిరుపతి నగరానికి చెందిన కొందరు అక్రమ నిర్మాణాలు చేపట్టేందుకు ప్రయత్నించారు. మంగళం సర్వే నెంబర్ 76లోని సుమారు అర ఎకరా భూమిలో ఇళ్ల నిర్మాణాలకు తెగబడ్డారు. విషయం తెలుసుకున్న వీఆర్‌వోలు సతీష్, ప్రసాద్‌లతో పాటు స్థానిక ప్రజలు ఆక్రమణ దారులను అడ్డుకుని నిర్మాణాలను నిలిపివేశారు. అయితే తమ వద్ద ఇళ్ల పట్టాలు ఉన్నాయని, కోర్టు ఆర్డర్ తమకు అనుకూలంగా ఉందని సదరు వ్యక్తులు తెలిపారు. పట్టాలను రెవెన్యూ అధికారులు పరిశీలించి నకిలీవిగా తేల్చారు. కోర్టు ఆర్డర్‌ను జేసీ దృష్టికి తీసుకెళ్లాలని సదరు నిర్మాణాలు చేపడుతున్న వ్యక్తులకు సూచించారు. అనుమతులు లేకుండా మరోమారు నిర్మాణాలకు పాల్పడితే చట్ట రీత్యా చర్యలు చేపడుతామని హెచ్చరించారు.

అవగాహన సదస్సుకు విశేష స్పందన



డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి

తిరుపతి ఎడ్యుకేషన్: తిరు పతి వరదరాజ నగర్‌లోని విశ్వం పాఠశాలలో ఆదివారం నిర్వహించిన సైనిక్ ప్రవేశ పరీక్షకు సంబంధించిన అవగాహన సదస్సుకు విశేష స్పందన లభించింది. ఈ సదస్సులో ఆ విద్యాసంస్థ అధినేత డాక్టర్ ఎన్. విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ గత 34 ఏళ్లుగా సైనిక్, నవోదయ, మిలిటరీ వంటి పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ అందిస్తూ అత్యుత్తమ ర్యాంకులు సాధిస్తున్నట్లు తెలిపారు. ఇవే తమ విద్యా ప్రమాణాలకు నిదర్శనమని తెలిపారు. సైనిక్ స్కూల్లో 6, 9 తరగతుల్లో ప్రవేశాలకు ఈ నెల 13వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

రంకెలేసిన కోడెగిత్తలు



కొండ్రెడ్డికండ్రిగలో పరుగులు తీస్తున్న కోడెగిత్తలు



రామచంద్రాపురం: రంకెలేస్తున్న కోడెగిత్త

చంద్రగిరి: మండలంలోని కొండ్రెడ్డికండ్రిగలో ఆదివారం నిర్వహించిన పశువుల పండుగ ఘనంగా జరిగింది. ఆవులు, ఎద్దులు, కోడెగిత్తలను పరుగులెత్తించారు. జోరుగా దూసుకొచ్చే కోడెగిత్తలను నిలువరించేందుకు యువకులు పోటీపడ్డారు.వాటికి కట్టిన పలకలను సొంతం చేసుకునేందుకు సాహసమే చేశారు. ఎడ్లపందేలను వీక్షించడానికి చుట్టపక్కల ప్రాంతాల నుంచి భారీగా విచ్చేయడంతో గ్రామమంతా జనసంద్రంగా మారింది. జల్లికట్టులో గెలుపొందిన వారు చెక్కపలకలను చేతపట్టుకుని విజయగర్వంతో ఊగిపోయారు. వాహనాలతో గ్రామం నిండిపోవంతో రాకపోకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. జల్లికట్టులో పలకలను సొంతం చేసుకోవడానికి అక్కడక్కడ యువకుల గ్రూపుల మధ్య గొడవలు చోటుచేసుకున్నాయి. ఎద్దులను నిలువరించే సమయంలో తాము పట్టామంటే.. తామంటూ గొడవలకు దిగారు. పశువుల పందేరాల్లో కొంతమంది యువకులు ఎద్దులను నిలువరించే క్రమంలో గాయపడగా వారిని నారావారిపల్లి సీహెచ్‌సీకు తరలించారు.

వేపకుప్పంలో..

రామచంద్రాపురం: ఉరక లేసే ఉత్సాహంతో రంకెలేసిన కోడెగిత్తల జోరుకు కళ్లెం వేసే ప్రయత్నం చేసి చేతికందిన పలకలతో సంబరాలు జరుపుకున్నారు. మండలంలోని వేపకుప్పంలో ఆదివారం పరుష పందేలు నిర్వహించారు. వందల మంది జనంతో గ్రామం జనసంద్రమైంది. పశువులను అందంగా అలంకరించి కొయ్యతో చెక్కిన పలకలు, రంగు కాగితాలు, వివిధ రకాల దేవుళ్ల బొమ్మలను అతికించి, డప్పులు కొట్టి జనంలోకి వదిలారు. యువకులు పశువులను నిలువరించి వాటి కొమ్ములకు ఉన్న బహుమతులను సొంతం చేసుకోవడానికి పోటీపడ్డారు.



రామచంద్రాపురం : వేపకుప్పంలో కోడెగిత్తను నిలువరిస్తున్న యువకులు



రామచంద్రాపురం : ప్రత్యేక అలంకరణలో కోడెగిత్త

తిరుమల శ్రీవారికి పరదాలు



శ్రీవారి భక్తుడు మణి రూపొందించిన పరదాలు, కురాళాలు

తిరుపతి కల్చరల్: ధనుర్మాసంలోని వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని తిరుమల శ్రీవారికి సమర్పించేందుకు తిరుపతికి చెందిన మణి అద్భుత కళారూపంతో పరదాలు, కురాళాలు రూపొందించారు. కృష్ణపరమాత్మ, గోదాదేవి, గోమాత, రామచిలుకలు, శంఖు చక్రాలు బంగారు లేసులు, కర్ణాభరణాలు, ఆర్టిఫిషయల్ డైమండ్స్, స్టోన్స్‌తో అద్భుత రీతిలో రూపొందించిన 5 పరదాలు, రెండు కురాళాలను ఈ నెల 7వ తేదీ మంగళవారం తిరుమలలో శ్రీవారికి సమర్పించనున్నట్లు శ్రీవారి భక్తుడు మణి తెలిపారు.

అన్నప్రసాదానికి రూ.51 లక్షల విరాళం



విరాళాన్ని అందజేస్తున్న కస్తూరి

తిరుమల : తిరుమల శ్రీవేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్ట్‌కు గుంటూరుకు చెందిన భాష్యం డెవెలపర్స్ సంస్థ డైరెక్టర్ డీ.కస్తూరి రూ.51 లక్షల విరాళాన్ని అందించారు. ఈ మేరకు విరాళం మొత్తానికి సంబంధించిన చెక్కును టీటీడీ అదనపు ఈఓ సీహెచ్.వెంకయ్యచౌదరికి అందజేశారు.

పందెం రాయుళ్ల అరెస్టు



పందెం రాయుళ్ల అరెస్టు చూపుతున్న పోలీసులు

వాకాడు: నిబంధనలకు విరుద్ధంగా కోడి పందేలు నిర్వహిస్తున్న స్థావరాలపై ఆదివారం వాకాడు పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో మండలంలోని కొండాపురం వడ్డిపాళెం గ్రామంలో దాడులు నిర్వహించి ముగ్గురు వ్యక్తులతో పాటు మూడు పందెం కోళ్లు, రూ.1150 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ నాగబాబు తెలిపారు.

ఆర్టీసీ బస్టాండులో వ్యక్తి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ ఆదిలక్ష్మి

నాయుడుపేట టౌన్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండులో ఓ వ్యక్తి మృతి చెంది ఉండడాన్ని ఆదివారం గుర్తించారు. బస్టాండు ప్రయాణికులు వేచి ఉండే స్థలంలో ఓ వ్యక్తి అపస్మారకస్థితిలో పడి ఉండడాన్ని గుర్తించి 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అంబులెన్స్ సిబ్బంది సంఘటనా స్థలం వద్దకు చేరుకుని పరిశీలించి మృతి చెందినట్లుగా నిర్ధారించా రు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ ఆదిలక్ష్మి బస్టాండు వద్దకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు కలువాయి ప్రాంతానికి చెందిన షేక్ సిరాజ్(40)గా గుర్తించారు. మృతుడికి కొన్నేళ్లుగా మతి స్థిమితం సరిగా లేక అనారోగ్యంతో బాధపడుతూ దర్గాల వద్ద తిరుగు తుండేవాడని మృతుని తమ్ముడు షేక్ నసీరుద్దీన్ తెలిపారు. ఈ క్రమంలో సిరాజ్ వేనాడు దర్గాకు వెళ్లేందుకు నెల్లూరు నుంచి నాయుడుపేట వచ్చి మృతి చెంది ఉండవచ్చునని మృతుని తమ్ముడు పోలీసులకు తెలిపారు. మృతునికి ఇంకా వివాహం కాలేదన్నారు. ఎస్‌ఐ ఆదిలక్ష్మి పూర్తి వివరాలు తెలుసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా జయకుమార్‌రెడ్డి



తడ: మండలంలోని తడ కండ్రిగ పంచాయతీ, బోడిలింగాలపాడు గ్రామానికి చెందిన యువ నాయకుడు బోడిలింగాలపాడు జయకుమార్‌రెడ్డిని వైఎస్ఆర్ సీపీ ఉమ్మడి నెల్లూరు జిల్లా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడిగా నియమించారు. వైఎస్ఆర్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకాల్లో భాగంగా పార్టీ కేంద్ర కార్యాలయం జయకుమార్‌రెడ్డికి కీలక పదవి అందించింది. పార్టీ కార్యకలాపాల్లో కీలకంగా వ్యవహరిస్తూ, హుషారైన కార్యకర్తగా పని చేసిన జయకుమార్‌రెడ్డి నిబద్ధతను గుర్తించిన మాజీ శాసన సభ్యులు కిలివేటి సంజీవయ్య ఆయన పేరును ఈ పదవికి సిఫారసు చేశారు.

వృద్ధురాలితో మాటలు కలిపి..

– 19 సవర్ల నగలను చోరీ చేసిన మాయలేడి



బాధితురాలు ఓసూరమ్మ

నారాయణవనం: ఇంటి బయట అరుగుపై ఒంటరిగా కూర్చున్న వృద్ధురాలిపై ఓ మహిళ దాడి చేసి 19 సవర్ల బంగారు నగలను దోచుకెళ్లిన సంఘటన ఆదివారం రాత్రి నారాయణవనంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. స్థానిక నవసంధులో ఓసూరమ్మ(85) ఒంటరిగా ఉంటోంది. సాయంత్రం ఇంటి అరుగుపై కూర్చుని ఉండగా.. ఓ గుర్తు తెలియని మహిళ వచ్చి మాటలు కలిపింది. చీకటిలో జన సంచారం లేకపోవడంతో ఓసూరమ్మపై దాడి చేసి చెవి కమ్మలు, గాజులు, చైను, ముక్కుపుడక లాక్కొని ఉడాయించింది. పెనుగులాటలో ముక్కు తెగిపోవడంతో ఓసూరమ్మ అరుపులకు ఇరుగు పొరుగు వారు వచ్చి పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వృద్ధురాలి ఫిర్యాదు మేరకు ఘటనపై విచారిస్తున్నామని పోలీసులు తెలిపారు.

మొదటి ఘాట్ రోడ్డులో ప్రమాదం

తిరుమల: తిరుమల మొదటి ఘాట్ రోడ్డు సమీపంలో ఓ కారు బోల్తా పడి ఇద్దరు గాయపడిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. కర్ణాటకకు చెందిన శ్రీవారి భక్తులు స్వామివారి దర్శనం ముగించుకుని కారులో తిరుగు పయనమయ్యారు. అయితే కారు అలిపిరికి సమీపంలో వేగంగా రావడంతో అదుపు చేయలేక బోల్తా పడింది. ఇందులో కేఏ05సీ6939 సఫారీ వాహనం బోల్తా పడింది. అందులోని ఇద్దరికి చిన్నపాటి గాయాలు కాగా వారిని రుయా హాస్పిటల్‌కు తరలించారు.

సందర్శకులకు ఇబ్బంది లేకుండా చర్యలు



నేలపట్టు పక్షుల కేంద్రంలో మొక్కలు నాటుతున్న ఫారెస్ట్ అధికారులు

దొరవారిసత్రం : రాష్ట్రప్రభుత్వం నేలపట్టు, పులికాట్ ప్రాంతాల్లో ఈనెల 17, 18, 19 తేదీల్లో మూడు రోజుల పాటు నిర్వహించే పక్షుల పండుగ సమయంలో సందర్శకులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని వైల్డ్ లైఫ్ పీసీసీఎఫ్ ఏకే నాయక్ సంబంధిత అధికారులకు సూచించారు. ఆయన ఆదివారం నేలపట్టు పక్షుల కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం ఆయన కేంద్రంలో విడిది చేసే విహంగాలను తిలకించారు. అదేవిధంగా పర్యావరణ కేంద్రం, పిల్లల పార్కులు, మార్గమధ్యలో పార్కులో ఉన్న జింకలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పక్షుల కేంద్రంలో మొక్కలు నాటారు. అనంతరం స్థానిక ఫారెస్ట్ అధికారులతో సమావేశమయ్యారు. పక్షుల పండుగ సమయంలో వచ్చే సందర్శకులు, పర్యాటకుల కోసం చేపట్టాల్సి ఏర్పాట్లపై చర్చించారు. కార్యక్రమంలో తిరుపతి సీఎఫ్ సెల్వం, నెల్లూరు, సూళ్లూరుపేట డీఎఫ్ఓ మహబూబ్‌బాషా, హారిక, ఎఫ్ఆర్ఓ సౌజన్య, ఎఫ్ఎస్ఓ బాలయ్య, సిబ్బంది ఉన్నారు.

భార్యతో గొడవపడి ఆత్మహత్య

తిరుపతి రూరల్: ఇంటి ఖర్చులకు డబ్బులు ఇవ్వకుండా తాగుడికే ఖర్చు చేస్తున్నావని భార్య మందలించడంతో క్షణికావేశంలో ఓ సెంట్రింగ్ మేస్త్రీ ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం తిరుపతి రూరల్ మండలం పేరూరు పంచాయతీలో చోటుచేసుకుంది. తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు కథనం..పేరూరు పంచాయతీ ఎన్టీఆర్ కాలనీలో కుప్పాల నందకుమార్(48) భార్యాబిడ్డలతో నివాసం ఉంటున్నాడు. సెంట్రింగ్ మేస్త్రీగా పనిచేస్తున్న ఆయన శనివారం సాయంత్రం ఇంటికి రావడం, ఆర్థిక లావాదేవీలతో భార్యతో గొడవపడ్డాడు. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో ఇంట్లో ఖర్చులకు ఇవ్వకుండా మద్యానికే డబ్బులు తగలేస్తున్నావంటూ భార్య మందలించింది. ఇకనైనా కుటుంబాన్ని పట్టించుకోవాలని హితవు పలికింది. ఇదే విషయాన్ని కుమార్తె కూడా చెప్పడంతో నందకుమార్ క్షణికావేశానికి గురయ్యాడు. ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం ఉదయం గుర్తించిన కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారమిచ్చారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులు నందకుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కాలేజీ మార్చురీకి తరలించారు. సీఐ కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు ఎర్రచ్రందనం స్మగ్లర్ల అరెస్ట్



ఎర్రచందనంతో పాటు ఇద్దరు స్మగ్లర్లను అరెస్ట్ చేసిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు

తిరుపతి మంగళం: తిరుపతి జిల్లా రేణిగుంట మండలం, మామండూరు అటవీ ప్రాంతంలో ఎర్రచందనం చెట్లను నరికి, వాటిని దుంగలుగా మారుస్తున్న ఇద్దరు స్మగ్లర్లను ఆదివారం టాస్క్‌ఫోర్సు పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి మూడు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఆర్ఎస్ఐ వై.విశ్వనాథ్ టీమ్ శనివారం సాయంత్రం నుంచి రేణిగుంట సమీపంలోని మామండూరు అటవీ ప్రాంతంలో అటవీ సిబ్బందితో కలసి కూంబింగ్ చేపట్టారు. తిరుపతి ఫారెస్టు డివిజన్ పరిధి మామండూరు నార్త్ ఫారెస్టు బీటులోని గోకుడు బండలు సమీపంలో తమిళనాడుకు చెందిన ఇద్దరు స్మగ్లర్లను అదుపులోనికి తీసుకున్నారు. అక్కడే ఉన్న మూడు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు.

మా నియోజకవర్గంలో మీరెలా ఆక్రమిస్తారు ?

- తిరుపతి వాళ్లు మీ నియోజకవర్గంలో ఆక్రమించుకోండి
- చంద్రగిరి టీడీపీ నేతలు వర్సెస్ తిరుపతి నేతలు
- మొన్న కొంకచెన్నాయిగుంటలో.. తాజాగా మిట్టగాంధీపురం మార్గంలో భూ ఆక్రమణ
- విషయం తెలిసినా స్తబ్దుగా ఉంటున్న రెవెన్యూ అధికారులు



మంగళం-మిట్టగాంధీపురం రోడ్డు మార్గంలో ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలను అడ్డుకుంటున్న రెవెన్యూ ఉద్యోగులు



కొంకచెన్నాయిగుంట చెరువులో ఆక్రమణలను తొలగిస్తున్న అధికారులు

తిరుపతి అర్బన్: దినదినాభివృద్ధి చెందుతున్న తిరుపతిలో భూముల ధరలు రోజురోజుకు పెరుగుతున్న సంగతి తెలిసిందే. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టీడీపీ నేతల భూ ఆక్రమణలు కూడా అంతే జోరుగా కొనసాగుతున్నాయి. తిరుపతి అర్బన్ ప్రాంతానికి చెందిన పలువురు టీడీపీ నేతలు రూరల్ ప్రాంతాల్లో ప్రభుత్వ భూములను ఆక్రమించేయత్నం చేస్తున్నారు. అయితే ఎవ రి నియోజకవర్గంలో వారే భూ ఆక్రణలు చేసుకోవాలని టీడీపీ నేతలు నిబంధన పెట్టుకుంటున్నారు. ఒకవేళ కాదని ఎవరైనా పక్క నియోజకవర్గాల్లో భూములను ఆక్రమిస్తే అటువైపు వారే రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చి అడ్డుకుంటున్నారు. అయితే టీడీపీ నేతల భూ ఆక్రమణల గురించి అధికారులకు ముందే తెలిసినా సైలెంటుగా ఉంటున్నారనే విమర్శలు గట్టిగానే వినిపిస్తున్నాయి. ఎవరైనా భూ ఆక్రమణలపై ఫిర్యాదులు చేస్తేనే.. అప్పుడు స్పందించి నిర్మాణాలను అడ్డుకుంటున్నారు.

చంద్రగిరి – తిరుపతి నేతల మధ్య విభేదాలు

తిరుపతి నగరం సమీపంలోని మంగళం నుంచి మిట్టగాంధీపురానికి వెళ్లే మార్గంలో రోడ్డు పక్కన రూ.4.50 కోట్లు విలువజేసే 50 సెంట్ల ప్రభుత్వ భూమిని ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నట్లు చంద్రగిరి నియోజకవర్గానికి చెందిన టీడీపీ నేతలు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడంతో వారు అడ్డుకున్నారు. అయితే ఇక్కడ చంద్రగిరికి చెందిన టీడీపీ నేతలు చెప్పేది ఏమిటంటే.. తమ నియోజకవర్గంలో తిరుపతి టీడీపీ నేతలు వచ్చి ఎలా ఆక్రమించుకుంటారని ప్రశ్నిస్తున్నారు. ఎవరి నియోజకవర్గంలో వారు చేసుకోవడం మంచిదంటూ హెచ్చరికలు జారీ చేసినట్లు తెలుస్తోంది.

మొన్న కొంకచెన్నాయిగుంటలో ..

తిరుపతి నగరంలో అతి విలువైన చెరువు కొంకచెన్నాయిగుంట ప్రాంతంలో నివాస స్థలాలకు మంచి డిమాండ్ ఉండడంతో టీడీపీ శ్రేణులు ఇష్టారాజ్యంగా ఆక్రమించుకున్నారు. గతంలో మాజీ సైనికోద్యోగులకు పట్టాలు ఇచ్చినా.. వారిని ఆ స్థలంలోకి అడుగు పెట్టనివ్వడం లేదు. అంతటితో ఆగని పచ్చ బ్యాచ్ ఏకంగా మాజీ సైనికోద్యోగులు తమకు అమ్మినట్లు తప్పుడు పత్రాలు సృష్టించి ప్లాట్లు వేసి అమ్మి సొమ్ము చేసుకున్నారు. చెరువు ఆక్రమణకు గురైందని సాక్షి పలుమార్లు వెలుగులోకి తీసుకురాగా రెవెన్యూ అధికారులు వచ్చి తాత్కాలిక షెడ్లు తొలగించి వెళ్తున్నారు. న్యాయస్థానం కూడా ఆ భూమి చెరువు పోరంబోకు అని స్పష్టం చేసినా.. టీడీపీ నేతలు పట్టించుకోవడం లేదు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే వదిలిపెట్టం

మంగళం-మిట్టగాంధీపురం రోడ్డు మార్గంలో జరుగుతున్న కట్టడాలను ఆదివారం అడ్డుకున్నాం. ప్రభుత్వ భూమి అయినప్పటికీ ఇద్దరు వ్యక్తులు ఆ భూమి తమదంటే తమదే అంటూ వస్తున్నారు. మరోసారి అన్ని డాక్యుమెంట్లను పరిశీలిస్తాం. ఇటీవల కొంకచెన్నాయిగుంటలోనూ ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు చేపడుతుంటే అడ్డుకున్నాం. తమ దృష్టికి వచ్చినా.. లేదా ఎవరైనా ఆక్రమణలపై ఫిర్యాదులు చేసినా వెంటనే అడ్డుకుంటున్నాం. మరోవైపు తిరుపతి నగరంలోని ప్రభుత్వ స్థలాలను పూర్తిగా గుర్తించడంతో పాటు ఉన్నతాధికారులతో మాట్లాడి నోటీస్ బోర్డులను ఏర్పాటు చేస్తాం. ప్రభుత్వ భూముల జోలికి వెళ్తే కఠిన చర్యలు తప్పవు.

– కేపీ భాగ్యలక్ష్మి, తహసీల్దార్, తిరుపతి అర్బన్